క్లుప్తంగా

రాష్ట్రస్థాయిలో సీఎం కప్ పోటీలో 3వ స్థానం



తాడూరు: హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న సీఎం కప్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్(ఊషు)లో తాడూరు ఉన్నత పాఠశాల విద్యార్థి చంద్రశేఖర్ 3వ స్థానం దక్కించుకున్నారు. హైదరాబాద్ కేవీబీబీఆర్ యూసుఫ్‌గూడ స్టేడియంలో ఈ పోటీ లు నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో3వ స్థానం దక్కించుకున్న విద్యార్థిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

నందివడ్డెమాన్‌లో బీసీ కమిటీ ఎన్నిక



బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన గ్రామ బీసీ కమిటీని మండల బీసీ సంఘం నాయకులు రాజేందర్‌గౌడు, వెంకటస్వామి, రఘుబాబుల ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నందివడ్డెమాన్ గ్రామ బీసీ సంఘం అధ్యక్షుడిగా కడారి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా అస్కని రమేష్, కోశాధికారిగా వంగ దామోదర్‌గౌడు, ఉపాధ్యక్షులుగా యాదయ్య, శ్రీరాములు, కాశీం, నర్సింహ, ఆయా శాఖల్లో చెన్నయ్య, చిన్నయ్య, దస్తగిరి, రాజు, కురుమయ్య, ప్రభాకరాచారి, చిన్న కురుమయ్య, నంబివేణు, తదితరులను ఎన్నుకున్నారు.

మైనార్టీ వెల్ఫేర్ మండల కమిటీ

బల్మూర్: మండల మైనార్టీ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా ఖదీ ర్, ఉపాధ్యక్షులుగా ఖాదర్‌నాయక్, కార్యద ర్శిగా యూనుస్, జాయింట్ సెక్రటరీగా తాహేర్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు మైనార్టీ సంఘం నాయకులు గౌస్ తెలిపారు.


ఎంబీ చర్చి నూతన యూత్ కమిటీ

కందనూలు: జిల్లా కేంద్రంలోని ఎంబీ చర్చిలో నూతన యూత్ కమిటీని ఎ న్నుకున్నారు. ఎంబీ చర్చి యూత్ చైర్మన్‌గా ఎ.ప్రదీప్‌కుమార్, సెక్రటరీగా ఈఐ దాని జయసింహ, డీజే జగదీష్‌లు ఎన్నికయ్యారు. వారికి చర్చి కమిటీ వారు ఘన స్వాగతం పలికారు. అ నంతరం నూతనంగా ఎన్నికైన యూత్ చైర్మన్ మాట్లాడుతూ 120 ఏళ్ల చరిత్ర గల చర్చికి యూత్ చైర్మన్ కావడం హర్షనీయమన్నారు. ఈ అవకాశం ఇచ్చిన చర్చి కమిటీకి, యూత్ వారికి, సంఘస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి బ్రాస్లెట్ చోరీ

బిజినేపల్లి: మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణంలో బస్సు ఎక్కుతున్న క్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలి చేతి బ్రాస్లెట్‌ను గుర్తు తెలియని దుండగులు శనివారం సాయంత్రం కొట్టేశారు. స్థానిక జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు జడ్చర్ల వెళ్లేందుకు ప్రయాణ ప్రాంగణానికి వచ్చింది. వనపర్తి నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సులో ఆమె ఎక్కింది. కాసేపటికే తన చేతికి ఉన్న బ్రాస్లెట్ కన్పించక పోవడంతో బస్సును అక్కడే నిలిపి పోలీసులకు సమాచారం ఇచ్చింది. వెంటనే ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు బస్సులోని ప్రయాణికులను చెక్ చేశారు. ఉపాధ్యాయురాలి చేతికి 8 గ్రాముల బ్రాస్లెట్ పోయింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రుణమాఫీ చేయాలి



కల్వకుర్తిరూరల్: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ కాని రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎస్‌రెడ్డికి ఆదివారం వినతి పత్రం అందజేశారు. 10 ఎకరాలు ఉన్న రైతులకు రైతుబంధ్ పథకం అమలు చేయాలని కేవీఎస్ రెడ్డిని కోరారు. త్వరలోనే సీఎంను కలుస్తానని కేవీఎస్‌రెడ్డి చెప్పినట్లు యువజన కాంగ్రెస్ నాయకులు శివప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో తిరుపతయ్య, శివకుమార్, ఆరీఫ్, తదితరులు ఉన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్ మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: గుండెపోటుతో కాంట్రాక్టు లెక్చరర్ మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. శ్రీపురం సమీపంలోని బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ అలీ(38) తెల్లవారుజామున నైట్ డ్యూటీ అనంతరం అక్కడే మార్నింగ్ వాక్ చేస్తున్న క్రమంలో అకస్మాత్తుగా గుండెపోటుతో పడిపోయారు. అతనిని చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించిగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య ఉన్నారు. మహమ్మద్ అలీ మృతిపట్ల పలువురు సంతాపం తెలిపారు.

ఆయకట్టుకు అందని సాగునీరు

- డ్రెయినేజీని తలపిస్తున్న డిండి కుడి కాల్వ
- లక్షలు వెచ్చించినా నిరుపయోగమే..
- ఆందోళన చెందుతున్న రైతులు



చిన్నపాటి కుంట కింది కాల్వను తలపిస్తున్న డిండి ప్రాజెక్టు కుడి కాల్వ

ఉప్పునుంతల: ఉమ్మడి పాలమూరు రైతులు సాగు నీటి విషయంలో అన్ని రకాలుగా దగా పడుతున్నారనే దానికి సవతితల్లి ప్రేమను తలపించేలా డిండి ప్రాజెక్టు కుడి కాల్వ పనులే నిదర్శనంగా ఉన్నాయి. పదిహేనేళ్ల క్రితం రూ.1.50 కోట్ల జపాన్ నిధులతో ఉప్పునుంతల మండలంలోని లత్తీపూర్, గువ్వలోనిపల్లి శివారులోని 330 ఎకరాల ఉమ్మడి పాలమూరు జిల్లా ఆయకట్టుకు సాగునీరందించాలనే లక్ష్యంతో కుడికాల్వను ఏర్పాటు చేశారు. కాల్వ పనుల తీరు చిన్నపాటి కుంట కింది కాల్వ మాదిరిగా ఉన్నాయి. ఉన్న కాల్వ కూడా నాసిరకంగా చేయడంతో పట్టుమని పదేళ్లు గడవక ముందే అక్కడక్కడ పగుళ్లు వచ్చాయి. కాల్వ వెంట నీరు వదిలినా నీరు ఎక్కిపారే పరిస్థితి ఉంది. ప్రస్తుతం డిండి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండినా కుడికాల్వ వెంట నీళ్లు వచ్చే పరిస్థితి లేదు. దీంతో పాటు వెల్టూరు చెరువు అలుగుపారి తీగలకుంట మీదుగా వచ్చే ఎంజీకేఎల్ఐ నీరు డిండి కుడి కాల్వ వెంట మర్రికుంట నింపుకునే అవకాశం ఉంటుంది. కాల్వ సరిగా లేక పోవడంతో కుంటలోకి నీరు వచ్చే పరిస్థితిలేక రైతులు, ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర అందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు కుడి కాల్వ నిర్వాహణ, నీ టి విడుదలపై నల్గొండ జిల్లా అధికారుల అజమాయిషీ ఉండటం, ఈ ప్రాంత అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టింపులేకపోవడంతో చిన్న పాటి కాల్వ వెంట నీరు సరిగా రావడం లేదని ఆయకట్టు రైతు లు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు ఆయకట్టు రైతులు ఒక్క సీజన్‌లోనైనా కాల్వ నీటితో పూ ర్తిస్థాయిలో పంటలు పండించుకోలేదు. ఇప్పటికైనా పాలకులు శ్రద్ధచూపించి రైతుల పక్షాన పోరాడి ఆయకట్టుకు నీరందేలా కృషి చేయాలని కోరుతున్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ కురుమూర్తి

పెద్దకొత్తపల్లి: మైసమ్మ జాతరకు వచ్చిన భక్తులు మద్యం తాగి వాహనాలు నడపొద్దని పెద్దకొత్తపల్లి ఎస్ఐ సతీష్ అన్నారు. ఆదివారం పెద్దకారు పాముల రోడ్డుపై వాహనాలు నడిపే వారికి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగిన వారిని గుర్తించబడిందన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రమాదాల వల్ల మర ణిస్తే వారి కుటుంబాలు రోడ్డుపాలు అవుతాయన్నారు. తనిఖీలో పోలీసులు పాల్గొన్నారు.

వాహన దారులు జాగ్రతలు పాటించాలి

వెల్దండ: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలను నడపాలని ఎస్ఐ కురుమూర్తి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9గంటలకు వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.ప్రతి వా హన దారుడు పూర్తిగా పేపర్లు ఉండే విధంగా చూసుకోవాలన్నారు. అజాగ్రతగా వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

మైసమ్మ జాతరకు భక్తుల రద్దీ



పెద్దకొత్తపల్లి మైసమ్మ దేవతకు మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు భక్తు లు ఎక్కువ సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వానాకాలం పంటలు చేతికందడంతో రైతులు, వ్యవసాయకూలీలు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. భక్తుల కోసం ఆర్టీసీ వారు నాగర్‌కర్నూల్, వనపర్తి, కొల్లాపూర్ డిపోల నుంచి బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. గద్వాల, వనపర్తి, పెబ్బేరు, కొల్లాపూర్, అచ్చంపేట ప్రాంతాల నుంచి బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో తరలివచ్చారు. ఆదివారం 8 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో ఆశావర్కర్లు

కొల్లాపూర్: ఆశావర్కర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆశావర్కర్ల సంఘం జిల్లా నాయకురాలు శ్రీదేవి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం కొల్లాపూర్‌లో ఆశావర్కర్లు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ ఆశావర్కర్ల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బస్సుజాతా ఈనెల 31న హైదరాబాద్‌లో ముగుస్తుందన్నారు. జాతా ముగింపు సందర్భంగా ఇందిరాపార్కు వద్ద నిర్వహించే సభకు ఆశావర్కర్లు హాజరుకావాలని ఆమె సూచించారు. ఆశావర్కర్లకు కనీస వేతన చట్టం ప్రకారం నెలవారీ జీతాలు చెల్లించాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న సర్వే డబ్బులు చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మంజుల, వకుళాదేవి, మల్లికాంత, రాధ, అనిత, రేణుక, అరుణ, నీలమ్మ ఉన్నారు.

మర్రిని పరామర్శించిన మాజీ స్పీకర్



తిమ్మాజిపేట: మాజీ శాసన సభ్యుడు మర్రి జనార్ధన్‌రెడ్డి తండ్రి మర్రి జంగిరెడ్డి ఇటీవల మరణించడంతో వారి కుటుంబాన్ని మాజీ స్పీకర్ మధుసూదనాచారి ఆదివారం ప్రత్యేకంగా పరామర్శించారు. తిమ్మాజిపేట మండలంలోని నేరళ్లపల్లి గ్రామంలో మర్రి జంగిరెడ్డి చిత్ర పటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.

గుండాల దేవాలయంలో ప్రత్యేక పూజలు



గుండాల దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



దోమలపెంటలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

వెల్దండ: మండలంలోని గుండాల గ్రామంలోని శ్రీ అంబా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం మాస శివరాత్రి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతల నుంచి భక్తులు కోనేరులో పుణ్యస్నానాలు చేసి స్వామివారికి రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామార్చన, నీరాజన, మంత్రపుష్పముల పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రమ్యసౌజన్య, అయ్యప్పస్వాములు, అర్చకులు శివకుమార్‌శర్మ, సురేష్‌శర్మ, తదితరులు ఉన్నారు.

శివాలయంలో అన్నదానం

దోమలపెంట: మాస శివరాత్రి పురస్కరించుకుని ఆదివారం దోమలపెంటలోని శివాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు కుటుంబ సమేతంగా అధికంగా పాల్గొన్నారు. ఉదయం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేశారు.

పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం



అప్పటి గురువులతో కలిసి పూర్వ విద్యార్థులు

ఉప్పునుంతల: జెడ్పీహెచ్ఎస్ 1998–99 పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 25 ఏళ్ల సిల్వర్ జూబ్లీ వేడుకలను పురస్కరించుకొని ఆదివారం స్థానిక యశోద ఫంక్షన్ హాల్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమ గురువులు కాశన్న, హన్మంత్‌రెడ్డి, ఇస్రత్‌బేగం, సత్యపాల్‌రెడ్డి, సత్యనారాయణలను సమ్మేళనంలో సన్మానించారు. చనిపోయిన మిత్రులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అరుణ, కవిత, సౌజన్య, విజిత, అనిత, బాలస్వామి, శ్రీనివాసులు, తిర్పతయ్య, వెంకట్రాములు, వెంకటయ్యగౌడ్, మల్లేష్, భీమేశ్వరాచారి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఉత్సవాలను జయప్రదం చేయండి

తెలకపల్లి: భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) ఆవిర్భవించి 90 ఏళ్లు పూర్తి అయ్యిందని మండల కార్యదర్శి వేనెపల్లి రవీందర్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున దశాబ్ది ఉత్సవాలు జరుగుతున్నాయని, ఈ ఉత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 30న నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాలలో అత్యధికంగా పాల్గొనాలని కోరారు. శతాబ్ది ఉత్సవాలు ఏడాది పొడవునా కొనసాగుతాయని, ఈ ఉత్సవాలకు భారీ ఎత్తున కార్యకర్తలు, సానుభూతిపరులు తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అర్ధాంతరంగా నిలిచిన నిర్మాణం

- బిల్లులు రాకపోవడంతో చేతులెత్తేసిన కాంట్రాక్టరు..



లింగాల ఉన్నత పాఠశాలలో అర్ధాంతరంగా నిలిచిన తరగతి గదుల నిర్మాణం పనులు

లింగాల: గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు–మన బడి పథకం ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. గతేడాదిన్నర కాలంగా పనులు నిలిచి పోయినా ప్రభుత్వ పట్టించుకోక పోవడంతో భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ పథకం ప్రారంభంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. టెండర్‌దారులు ఆదరాబాదరగా పనులను ప్రారంభించి చేతులెత్తేశారు. చేసిన పనులకు బిల్లులు రాక పనులు నిలిపేశారు. ఇప్పు డున్న ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతుల గురించి పట్టించుకోవడం లేదని ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఎంఈఓ బషీర్ అహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వ నుంచి నిధులు రాక పోవడంతో పనులు చేపట్టిన వారు నిలిపేశారని, నిధులు విడుదలైన వెంటనే తిరిగి ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.

దళితుల అభ్యున్నతికి కృషి చేయాలి



మాట్లాడుతున్న వెంకటేష్

తాడూరు: రాష్ట్రంలో దళితుల అభ్యున్నతికి కార్పొరేషన్ నిధులు అదనంగా మంజూరు చేయా లని మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో రాజకీయ నాయకుల జోక్యం తగదన్నారు. ఎస్సీ కుల గణన రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందని, అందులో ఎస్సీల జనాభా ఎంత అనేది ప్రభుత్వానికి అర్థం అవుతుందని, అందుకే ఎస్సీ రిజర్వేషన్‌ల శాతాన్ని పెంచే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. బీసీలకు ఎస్సీ సర్టిఫికేట్లు ఇవ్వరాదని, ఇందుకు సంబంధించి కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దారులకు వినతి పత్రాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు పర్వతాలు, చంద్రయ్య, ఎరుకలి సంఘం నాయకులు కుర్మయ్య, భాస్కర్, రవి పాల్గొన్నారు.

పేదల హక్కుల కోసం పోరాడదాం



తాడూరు: సమాజంలోని పేదల హక్కుల సాధన కోసం పోరాడాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు వెంకటయ్య అన్నారు. ఆదివారం మండలంలోని గుంతకోడూరులో సీపీఐ గ్రామశాఖ కార్యదర్శి ఏకాంబరంగౌడ్ అధ్యక్షతన సీపీఐ 99వ వార్షికోత్సవం నిర్వహించారు. అనంతరం 100సం.ల కేక్‌ను కట్ చేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. సీపీఐ నాయకులు ఎండీ కుతుబుద్దీన్, నిరంజన్‌గౌడ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్, నాయకులు శ్రీనివాసులు, చంద్రయ్యగౌడ్, పెద్ద నర్సింహ, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై దాడి చేసిన వారిని శిక్షించాలి



మాట్లాడుతున్న పరశురాములు

కల్వకుర్తిరూరల్: రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కార్యదర్శి పరశురాములు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలకు అయ్యప్ప మాల వేసుకున్న 8వ తరగతి విద్యార్థినికి కాలు తాకిందనే నెపంతో 50 మంది దుండగులు రాములు దాడి చేసి కులం పేరుతో దూషించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. పోలీసులు, ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. డిసెంబర్ 21న పాఠశాల ఆవరణలో విద్యార్థులను కూర్చోబెట్టి పాఠ్యాంశాలు బోధిస్తున్న సందర్భంలో 8వ తరగతి విద్యార్థి అరుణ్ అయ్యప్పమాల వేసుకొని కూర్చున్నారని తెలిపారు. ఆ సందర్భంలో విద్యార్థికి కాళ్లు తాకడంతో కుటుంబ సభ్యులు ఇతర స్వాములకు సమాచారం అందించడంతో డిసెంబర్ 23న 50 మంది నినాదాలు చేస్తూ హెచ్‌ఎంపై దాడి చేశారన్నారు. ఆధునిక సమాజంలో ఇలాంటి ఆటవిక చర్యలను ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, పౌరసమాజం కండించి మరోసారి ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని డిమాండ్ చేశారు. దాడి చేసినవారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, జగన్, కురుమయ్య, విజయ్, పరశురాములు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీని పరామర్శించిన నేత

కల్వకుర్తిరూరల్: మాజీ పార్లమెంట్ సభ్యుడు ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రత్యేక ప్రతినిధి డా మందా జగన్నాథంను ఆదివారం టీడీపీ రాష్ట్ర నాయకుడు యాదిలాల్ పరామర్శించాడు. అనారోగ్యంతో బాధపడుతూ మాజీ ఎంపీ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని యాదిలాల్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, రాముగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మదర్సాను అభివృద్ధి చేయాలి



శిథిలావస్థలో పాతకాలపు పాఠశాల భవనం

ఉప్పునుంతల: మండలంలోని మొల్గరలో డెబ్బై ఏళ్ల క్రితం సంస్థానాధీసుల పాలనలో నిర్మించిన పాఠశాల (మదర్సా) భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఆ కాలంలో రాళ్లతో నిర్మితమైన ఈ భవనం ఆర్సీ నమూనాలో పైకప్పు వేశారు. పైకప్పు పడిపోగా గోడలు మాత్రం పటిష్టంగా ఉన్నాయి. ప్రస్తుతం వినియోగించుకునే పరిస్థితిలో లేదు. గ్రామంలో అందరికీ అందుబాటులో ఉన్న ఈ పటిష్టమైన పాత భవనానికి రూ.10 లక్షలు ఖర్చుచేసి మరమ్మతులు చేపడితే అందరికీ ప్రయోజనకరంగా ఉంటుందని గ్రామస్తులు పద్మారెడ్డి, సుమన్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, పవన్‌రెడ్డి, శ్రీరాములుగౌడ్, వెంకటయ్య తదితరులు అభిప్రాయపడుతున్నారు. ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకొస్తే గ్రామస్థాయిలో అధికారులు ప్రభుత్వ పరంగా నిర్వహించే కార్యక్రమాలకు, గ్రామస్తులు కమ్యూనిటీగా సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ భవనం ముందు గ్రామస్తులు సమిష్టి సహకారంతో అంజనేయ స్వామి ఆలయం నిర్మించుకున్నారు. నిరూపయోగంగా ఉన్న ఈ పాత భవనానికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెస్తే గ్రామంలో అందరికీ ప్రయోజనకరంగా ఉంటుంది. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ స్పందించి ఈ పాత భవనం మరమ్మతులకు నిధులు మంజూరు చేయించాలని కోరుతున్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఫిక్స్‌డ్ డిపాజిట్ల బాండ్లను బాధిత కుటుంబానికి అందజేస్తున్న మిత్రబృందం

తాడూరు: మండలంలోని తుమ్మలసూర్ గ్రామానికి చెందిన మస్కూరి శంకర్ విద్యుదాఘాతంతో వారంరోజుల క్రితం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఉన్నత పాఠశాల కుమ్మెర 2005 సంవత్సరం పదో తరగతి మిత్రులు రూ.1.12 లక్షలు జమ చేశారు. శంకర్ కూతురులు జ్ఞానశ్రీ, తన్మయశ్రీల పేర్లపై ఒక్కొక్కరికి రూ.56వేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు.

బాధిత కుటుంబానికి..

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాల గ్రామానికి చెందిన హుస్సేన్ ఇటీవల మృతి చెందాడు. ఆదివారం బాధిత కుటుంబానికి మాజీ సర్పంచ్ సునితావెంకట్‌రెడ్డి పరామర్శించి రూ.5 వేలు అందజేశారు. అనంతరం అదే గ్రామంలో కడారి వెంకటయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ రూ. 3వేలు అందజేశారు.

జూపల్లిలో..

చారకొండ: మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన కాటమోని ముత్యాలమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు రూ.10 వేలు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఆశాదీప్ రెడ్డి రూ.5 వేలు, మాజీ సర్పంచ్ మల్లీశ్వరి బాలరాజు రూ.5 వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. వారి వెంట బాల్‌రాజు, రాములు యాదవ్, సీరాజ్, గ్రామస్తులు ఉన్నారు.

మామిడి రైతుల్లో చిగురిస్తున్న ఆశలు



వీపనగండ్ల: మామిడి తోటలను సాగు చేసిన రైతు లు మామిడి చెట్లకు పూత రాక నిరాశతో ఉండగా.. వారం రోజులుగా పూత వస్తుండడంతో రైతులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. మండలంలో దాదాపు 8 వేల ఎకరాలలో రైతులు మామిడి తోటలను సాగు చేస్తున్నారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా డిసెంబర్ చివరి నాటికి కూడా చెట్లకు పూత రాలేదు. కానీ ఇప్పడిప్పుడే 50 శాతం తోటలు పూత దశకు వస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ వేసవి సీజన్‌లో అయిన మామిడి మార్కెట్లను ఏర్పాటు చేయాలని అత్యధికంగా మామిడి తోటలను సాగు చేసే గోవర్ధనగిరి, వీపనగండ్ల, కల్వరాల, రంగవరం, గోపల్‌దిన్నె, సంగినేనిపల్లి గ్రామాల రైతులు కోరుతున్నారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి



అపరిశుభ్రంగా ఉన్న తాగునీటి బోరు

మన్ననూర్: చెరువు కొమ్ము లింగమయ్య స్వామి ఆలయం వద్ద ఉన్న బోరు నుంచి వచ్చే నీటిని ఎంతో పరిశుభ్రమైనవిగా భావిస్తూ గ్రామ ప్రజలు ఆ నీటినే తాగుతున్నారు. మన్ననూర్ గ్రామానికి 2 కిలో మీటర్ల దూరంలో శ్రీశైలం వెళ్లే ప్రధాన రహదారిలోని లింగమయ్య స్వామి ఆలయం వద్ద గత 20 ఏళ్ల క్రితం గ్రామ పంచాయతీ వారు బోరు వేయించారు. ఆ బోరు నుంచి వచ్చే నీరు ఫిల్టర్ వాటర్ కంటే పరిశుభ్రమైనవి, ఆరోగ్యపరంగా కూడా మంచివిగా అండటంతో గ్రామానికి చెందిన సుమారు 50–60 కుటుంబాల వారు ప్రతి నిత్యం ఇవే నీటిని సేకరిస్తూ తాగు నీటిగా ఉపయోగిస్తున్నారు. సమీపంలోని ప్రధాన రోడ్డు క్రమ క్రమంగా ఎత్తు అవుతుండటంతో బోరు గుంతలోకి అయ్యింది. దీంతో నీరు నిలిచి చెత్త చెదారం అక్కడే చేరుకొని ప్రస్తుతం అపరిశుభ్రంగా మారింది. సంబంధిత మండల, గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి బోరు చుట్టు పరిసరాలను పరిశుభ్రం చేయాలని కోరుతున్నారు.

యాసంగి సాగులో బిజీబిజీ

పాన్‌గల్: మండలంలోని వివిధ గ్రామాల్లో వానా కాలం పంట నూర్పిడి, ధాన్యం కొనుగోళ్లు పూర్తి కావడంతో రైతులు యాసంగి సాగులో భాగంగా వరి నాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేయడంలో బిజీబిజీగా ఉన్నారు. వానాకాలంలో మండలంలో ఆశించిన దానికంటే ఎక్కువగా వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు పెరగడం, పంటల సాగుకు ఆధారమైన కేఎల్ఐ, బీమా కాల్వల ద్వారా సాగునీరు వస్తుందని, బోర్లు, చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో రైతులు వరిపై మొగ్గు చూపుతున్నారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో యాసంగిలో 10,500 ఎకరాల్లో వరిసాగు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.